సాక్షి నంద్యాల
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



డిపార్టుమెంటల్ టెస్ట్ ప్రశాంతం

కర్నూలు(సెంట్రల్): డిపార్టుమెంటల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సనత్ నగర్ డిజిటల్ అయాన్‌లోని కేంద్రాన్ని డీఆర్వో వెంకట నారాయణమ్మ పరిశీలించారు.



ఆంగ్ల భాషా ప్రావీణ్యానికి స్పెల్‌బీ

సాక్షి, ఎరీనా స్కూలు ఫెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. కర్నూలులో నిర్వహించిన పరీక్షకు 43 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8లో▸



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి పూజలు చేశారు.

న్యూస్‌రీల్

శ్రీశైలంలో పెరిగిన భక్తుల రద్దీ



క్యూలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజును పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూల వద్ద బారులు తీరారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. కాగా భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

శ్రీశైలంలో అన్యమత కార్యకలాపాలు నిషేధం



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలం టెంపుల్: దేవదాయశాఖ నిబంధనలను అనుసరించి శ్రీశైల క్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం, అన్యమతాలకు సంబంధించిన కార్యకలాపాలు, అన్యమత చిహ్నాల ప్రదర్శనను పూర్తిగా నిషేధించినట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఈఓ మాట్లాడుతూ అన్యమత సూక్తులను, చిహ్నలను, బోధనలను, అన్యమతానికి సంబంధించిన ఫొటోలు కలిగి ఉన్న వాహనాలు కూడా క్షేత్ర పరిధిలోకి అనుమతించబడవని పేర్కొన్నారు. శ్రీశైల క్షేత్ర పరిధిలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ అన్యమత ప్రచారాలకు, అన్యమత కార్యక్రమాలకు సహకరించడం కూడా చట్టం ప్రకారం శిక్షార్హమే అని తెలిపారు.

తెలుగుగంగకు నీరు విడుదల

రుద్రవరం: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి అధికారులు తెలుగు గంగ కాల్వకు సాగు నీరు విడుదల చేశారు. ఆదివారం రుద్రవరం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న గండ్లేరు (తుండ్ల వాగు) రిజర్వాయరుకు చేరుకుంది. గత నెలలో వెలుగోడు రిజర్వాయరు నుంచి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో వరి,మినుము, మొక్క జొన్న తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందారు. నీరు లేకపోతే పంట పండదని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం రిజర్వాయర్ నుంచి కాల్వకు నీరు విడుదల చేశారు.

నేడు ప్రజా వినతుల స్వీకరణ

నంద్యాల: పట్టణంలోని కలెక్టరేట్ సెంటినరి హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుంది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.15 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 201 డీలర్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు కర్నూలు కలెక్టర్ పి.రంజిత్‌బాషా నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఇందులో కర్నూలు డివిజన్‌లో 76, ఆదోని డివిజన్‌లో 80, పత్తికొండ డివిజన్‌లో 45 పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులను రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూరించిన అర్జీలను డిసెంబర్ 23 నుంచి డిసెంబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నేరుగా, లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులకు పంపాలి.

పేదల గూడుపై కక్ష!

- గత ప్రభుత్వంలో జిల్లాలో వేలాది మందికి పక్కా గృహాలు మంజూరు
- జగనన్న కాలనీల పేరుతో నిర్మాణం
- వాటి అభివృద్ధిపై కూటమి సర్కారు అంతులేని నిర్లక్ష్యం
- రోడ్లు, తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పనను పట్టించుకోని వైనం
- గతంలో మంజూరైన గృహాల బిల్లుల చెల్లింపులో సైతం తీవ్ర జాప్యం
- అటకెక్కిన కొత్తగా పక్కాగృహాల మంజూరు హామీ



కోవెలకుంట్లలోని జగనన్న కాలనీలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు

పేదలందరికీ ఇళ్లు నిర్మించి వారి కలను నెరవేర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. జగనన్న కాలనీల పేరుతో కొత్త ఊళ్లనే నిర్మించింది. ఆరునెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త గృహాలు మంజూరు చేయకపోగా జగనన్న కాలనీలపై కక్షగట్టింది. రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, తదితర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపులో అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా గతంలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో మొత్తం జగనన్న కాలనీలు – **323**
గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలు – **56,523**
ఈ ఏడాది మార్చి నాటికి పూర్తైనవి – **30,713**
కూటమి ప్రభుత్వంలో బిల్లులు అందక వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్లు **25,710**

కోవెలకుంట్ల: గత ప్రభుత్వం జిల్లాలోని 29 మండలాల పరిధిలో 323 జగనన్న కాలనీలతోపాటు, సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు 56,523 పక్కాగృహాలు కేటాయించింది. ఈ ఏడాది మార్చి నాటికి ఆయా మండలాల్లో 30,713 పక్కాగృహాలు పూర్తి కాగా 15 వేల ఇళ్లు బేస్‌మెంట్, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్త ఇళ్లు ఇవ్వకపోగా గతంలో ప్రారంభించిన ఇళ్లను వచ్చే ఏడాది మార్చి లోపు పూర్తి చేయాలని నిబంధన విధించింది. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పురోగతిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటి వరకు ప్రారంభం కాని గృహ నిర్మాణాలను పూర్తిగా నిలిపివేసింది. కొత్త ఇళ్ల మంజూరు ఊసే పట్టించుకోకపోవడంతో పేదలకు సొంతింటి కల అందనంత దూరంలో ఉంది. దీనికి తోడు గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఊళ్లను నిర్మించిన వైఎస్సార్‌సీపీ సర్కార్

వైఎస్‌జగన్ ప్రభుత్వం నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా అర్హులకు ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేసింది. గృహ నిర్మాణానికి మూడు విడతల్లో రూ. 1.80 లక్షల బిల్లులు అందజేయడంతో పాటు ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, కడ్డీలు, గృహ నిర్మాణ సామగ్రి అందజేసి పేదలకు సొంతింటి కల నెరవేర్చింది. బేస్‌మట్టం వేసుకునేందుకు చేతిలో డబ్బులులేని లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా హౌసింగ్ పర్పస్(హెచ్ఎల్‌పీ) ద్వారా రూ. 35వేలు మంజూరు చేసింది. అంతే కాకుండా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్థిక వెసులుబాటు కల్పించింది. గృహ నిర్మాణం మొదలుపెట్టేందుకు లబ్ధిదారులకు రూ. 20 వేల చొప్పున అడ్వాన్స్ రూపేనా వారి ఖాతాల్లో జమ చేసి ఆదుకుంది. దీంతో పాటు జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకునే వారికి డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా అదనంగా రూ. 50వేలు,అదీ చాలకపోతే లక్ష రూపాయల వరకు రుణం అందించింది. తీసుకున్న అప్పులో రూ. 35 వేల వరకు పావలా వడ్డీ వర్తింపజేసింది. ఎస్సీ, ఎస్టీ స్వయం సహాయక సంఘాలకు(ఉన్నతి) వడ్డీ లేకుండా అదనపు రుణం అందజేసి ఆయా వర్గాల సొంతింటి కల నెరవేర్చింది.

జగనన్న కాలనీలను పట్టించుకోని సర్కారు

గత ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేసింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ తరహాల్లో పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. ప్రైవేట్ వెంచర్లను తలదన్నేలా కాలనీలకు ముందు ఆర్చిలు సైతం ఏర్పాటు చేసింది. కాలనీల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు స్థలాలు సైతం కేటాయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న కాలనీల్లో సమస్యలు తాండవం చేస్తున్నాయి. కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్ల నిర్మాణాలను పట్టించుకోకపోవడంతో పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. పలు కాలనీల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. కొన్నిచోట్ల ముళ్ల పొదలు పెరిగి విష సర్పాలు సంచరిస్తుండటంతో ఇళ్ల లో నుంచి బయటకొచ్చేందుకు భయపడుతున్నారు.



జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి

ఎన్నికల హామీ అమలెప్పుడో?

2014 నుంచి 2019 మధ్య కాలంలో అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కారు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. పక్కాగృహాలు మంజూరు చేయలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షలు ఇస్తామని కూటమి పార్టీలు హామీలు గుప్పించాయి. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ఇంత వరకు కొత్త ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభించకపోగా గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పలు ఆంక్షలు విధించింది. వచ్చే ఏడాది మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని షరతు విధించింది. ఇప్పటి వరకు ప్రారంభించని ఇళ్ల నిర్మాణాల అనుమతిని రద్దు చేసింది. అధికారంలోకి వచ్చాక కూటమి సర్కారు వ్యవహరిస్తున్న తీరు పట్ల లబ్ధిదారులు గుర్రుగా ఉన్నారు.

త్వరితగతిన బిల్లులు విడుదల చేయాలి



గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాల బిల్లులను త్వరితగతిన విడుదల చేయాలి. పట్టణ శివారులోని ఎస్సార్బీసీ కాలనీలో ఇంటి నిర్మాణం చేపట్టాను. బిల్లుతో పాటు సిమెంట్, కడ్డీలు, ఇసుక, తదితర ఇంటి నిర్మాణ సామగ్రిని సరఫరా చేసి పేదలకు సొంతింటి కల నెరవేర్చాలి.

– శ్రీనివాసనాయక్, లబ్ధిదారుడు, కోవెలకుంట్ల

మౌలిక వసతులు కల్పించాలి



జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రహదారులు, డ్రెయినేజీ, వీధిదీపాలు, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలి. పట్టించుకోకపోతే లబ్ధిదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– సుధాకర్, సీఐటీయూ నేత, కోవెలకుంట్ల

నల్లమల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

- మూడున్నర గంటలు నిలిచిన వాహనాలు

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే నల్లమల ఘాట్ రోడ్డులో ఆదివారం ట్రాఫిక్ జాం అయింది. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న ఓ లారీకి యాక్సిల్ కట్ అవడంతో నిలిచిపోయింది. అదే సమయంలో అధిక లోడ్‌తో వెళ్తున్న మరో లారీ పురాతన వంతెన సమీపంలో మలుపు వద్ద వెళ్లలేక ఆగిపోయింది. దీంతో సుమారు మూడున్నర గంటల పాటు ట్రాఫిక్ జాం కావడంతో ఇరువైపులా వందల సంఖ్యలో పెద్ద పెద్ద వాహనాలు ఆగిపోయాయి. భవానీదీక్ష స్వీకరించిన భక్తులు విజయవాడ వెళ్లేందుకు గంటలకొద్ది నిరీక్షించారు. ట్రాఫిక్‌జామ్ విషయం తెలుసుకున్న గిద్దలూరు, మహానంది పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరమ్మతులకు గురైన లారీని పక్కకు తప్పించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయని ప్రయాణికులు తెలిపారు.



నల్లమల ఘాట్‌రోడ్డులో ఆగిపోయిన వాహనాలు

నాపరాతి పరిశ్రమపై భారం తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న మైనింగ్ యజమానులు

కొలిమిగుండ్ల: ఇప్పటికే కష్టాల్లో కూరుకుపోయిన నాపరాతి పరిశ్రమపై కూటమి ప్రభుత్వం మరింత భారం వేయడం తగదని మైనింగ్ యజమానులు పేర్కొన్నారు. కన్సిడరేషన్ ఫీజులను భారీగా పెంచడాన్ని నిరసిస్తూ ఆదివారం బందార్లపల్లె క్రాస్ రోడ్డులోని రాయల్టీ చెక్‌పోస్టు సమీపంలో గొర్విమానుపల్లె, తుమ్మలపెంట, అంకిరెడ్డిపల్లె, బందార్లపల్లె,కనకాద్రిపల్లె తదితర గ్రామాలకు చెందిన గనులు, పాలీష్ ఫ్యాక్టరీల యజమానులు, ట్రాక్టర్ డ్రైవర్లు, కార్మికులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కన్సిడరేషన్ ఫీజు పెంపుతో రాయల్టీ ధరలు పెరిగాయన్నారు. ప్రస్తుతం నాపరాతి పరిశ్రమ ఆదరణ కరువై నష్టాల బాటలో నడుస్తుందన్నారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో ప్రభుత్వం రాయల్టీ ధర పెంచడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమపై ఆధారపడి వందలాది కార్మికుల కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కాన్సిడరేషన్ ఫీజు తగ్గించాలని, లేకపోతే కార్మికులు వలసలు పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సర్కారు తీరుకు నిరసనగా చెక్‌పోస్టు సమీపంలో మైనింగ్ యజమానులు చేపట్టిన ఆందోళనలో అధిక భాగం కూటమికి చెందిన వారే పాల్గొనడం గమనార్హం.

నేడు నాపరాయి రవాణా ట్రాక్టర్ల సమ్మె

బేతంచెర్ల: పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్ల నాపరాయి పరిశ్రమలకు బనగానపల్లె మండలంలోని పలుగ్రామాల గనుల నుంచి నాపరాయిని తరలించే లారీ, ట్రాక్టర్ యజమానులు సోమవారం సమ్మెకు పిలుపునిచ్చారు. రాయల్టీలు ఆన్‌లైన్‌లో అందుబాటులో లేకపోవడంతో అధికారులు తమకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈనెల 19న రాయల్టీలు లేని కారణంగా నాపరాళ్ల ట్రాక్టర్లను అధికారులు అడ్డుకోవడంతో ట్రాక్టర్, లారీ యజమానులు రోడ్డుపైనే వాహనాలు ఆపి ఆందోళనకు దిగారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటం నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని మైనింగ్ ఏడీ చెప్పడంతో ఆందోళన విరమించిన విషయం తెలిసిందే.

శ్రీశైలం నుంచి 11,596 క్యూసెక్కుల నీరు విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయం నుంచి ఆదివారం దిగువ ప్రాజెక్టులకు 11,596 క్యూసెక్కుల నీరు విడుదలచేశారు.విద్యుత్‌ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 6,666 క్యూసెక్కులు, బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కి 1,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతి ద్వార మల్యాల ఎత్తిపోతలకు 1,630 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 120 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 3.198 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. పంప్‌మోడ్ ఆపరేషన్‌తో 5,195 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు.ఆదివారం సాయంత్రం సమయానికి జలాశయంలో 114.2356 టీఎంసీల నీరు నిల్వ ఉంది.డ్యాం నీటిమట్టం 862.60 అడుగులకు చేరుకుంది.

కేసీలో భారీగా తగ్గిన నీటి ప్రవాహం



జూపాడుబంగ్లా: కేసీ కాల్వలో నీటి సరఫరా భారీగా తగ్గింది. దీంతో నిప్పులవాగు, ఏబీఆర్ కాల్వలకు సాగునీటి సరఫరా నిలిపివేసినట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 600 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా 340క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం లాకిన్స్‌లాకు 336 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని నేరుగా తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు మళ్లిస్తున్నామన్నారు.



నంద్యాల కాలేజీలో కెమిస్ట్రీ ల్యాబ్

ప్రయోగం లేదా..?

- జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్‌కు నోచుకోని విద్యార్థులు
- ప్రైవేటు కాలేజీల్లో ఇంకా బూజు దులపని సైన్స్ ల్యాబ్‌లు
- అపార్, కేర్‌టేకర్, సంకల్ప్, ఆన్‌లైన్ డేటా నమోదుతో సతమతమవుతున్న లెక్చరర్లు
- ఫిబ్రవరి 10 నుంచి మొదలు కానున్న ప్రాక్టికల్స్
- ఆందోళనలో విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల సమయం దగ్గర పడుతుంది. అందుకు ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులు సిద్ధం కావాల్సి ఉంది.అయితే, ఇప్పటి వరకు కాలేజీల్లో ఎంత వరకు ప్రయోగాలు పూర్తయ్యాయో పరిశీలిస్తే.. ఆశ్చర్యకర విషయాలు వెలుగు చూశాయి. అపార్, కేర్‌టేకర్, సంకల్ప్, ఆన్‌లైన్ డేటా నమోదు వంటి కార్యక్రమాలతో అధ్యాపకులను ప్రభుత్వం నిరంతరం బిజీగా ఉంచడంతో కాలేజీల్లో ప్రయోగాలు చేయించే వీలులేకపోయింది. ఇక ప్రైవేట్ కాలేజీల్లో సైన్స్ ల్యాబ్‌ల బూజు కూడా దులపలేదు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే 2025 మార్చి 1 నుంచి థియరీ పబ్లిక్ పరీక్షలు .. సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 10 నుంచి ప్రారంభమవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికారులు త్వరలో ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల కేటాయింపు కోసం జూనియర్ కాలేజీలను పరిశీలించనున్నారు. అక్కడ వసతుల కల్పన, సౌకర్యాల తీరును క్షుణ్ణంగా పరిశీలించి కేంద్రాల కేటాయింపునకు ప్రభుత్వానికి ప్రతిపాదన చేస్తారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో మొత్తం 135 జూనియర్ కళాశాలలు ఉండగా 28,688 మంది విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించారు. ప్రాక్టికల్ పరీక్షలకు 8,552 మంది హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ గ్రూప్ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు, బైపీసీ గ్రూపు వారికి ఆ రెండింటితో పాటు బొటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో ప్రాక్టికల్ జరగనున్నాయి. సబ్జెక్టుకు 30 చొప్పున మార్కులు కేటాయించనున్న విషయం తెలిసిందే. జాతీయ, రాష్ట్రస్థాయిలో నిర్వహించే జేఈఈ, నీట్, ఏపీఈఏపీసెట్ (పాత ఎంసెట్) వంటి ప్రవేశ పరీక్షల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజ్ ఉన్న నేపథ్యంలో ప్రాక్టికల్స్ మార్కులకు సైతం ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రభుత్వ కాలేజీల్లో అకడమిక్ వర్కే ఎక్కువ

ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో పరిస్థితి గందరగోళంగా ఉంది. అక్కడి లెక్చరర్లకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠాల కంటే అకడమిక్ వర్క్‌కే ఎక్కువ సమయం కేటాయించాల్సిన పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లెక్చరర్లకు పాఠాలు చెప్పడానికి తీరిక లేని పనులతో ముప్పుతిప్పలు పెడుతోంది. ఒకవైపు అపార్ నమోదు కుదిపేస్తోంది. మరోవైపు సంకల్ప్ పేరిట ప్రత్యేక క్లాసులు, కేర్‌టేకర్ వర్క్, ప్రత్యేకంగా పుస్తకాలు, విద్యార్థుల డేటా నమోదు, ప్రోగ్రెస్ కార్డుల తయారీ, ఆన్‌లైన్‌లో అటెండెన్స్, మార్కుల నమోదు, ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు డేటా తయారీ తదితర పనులను అధ్యాపకులకు అప్పగించింది. దీంతో వారు రెగ్యులర్ క్లాసులకే దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులతో ప్రయోగాలు చేయించలేని పరిస్థితి నెలకొంది. వెంటనే ఇంటర్ విద్య కమిషనర్ చొరవ తీసుకుని క్లాసుల బోధన, ప్రాక్టికల్స్ నిర్వహణకు ఆటంకం లేకుండా మార్గదర్శకాలను పునఃసమీక్షించాలని సైన్స్ లెక్చరర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రిన్సిపాళ్లకు దిశానిర్దేశం చేశాం



ఫిబ్రవరిలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణపై కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఇప్పటికే పలుమార్లు దిశానిర్దేశం చేశాం. ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని విద్యార్థులను బ్యాచ్‌ల వారీగా ప్రతి రోజు ప్రాక్టికల్స్ నిర్వహించాలి. అకడమిక్ పనులు చూసుకుంటూనే ప్రాక్టికల్స్‌కు సన్నద్ధం చేయాలి. ల్యాబ్‌లో కావాల్సిన పరికరాలు, సదుపాయాలు కూడా సమకూర్చుకోవాలి.

–గురువయ్యశెట్టి, ఆర్ఐఓ, నంద్యాల

క్రిస్మస్ కాంతులు





విద్యుత్ దీపాల వెలుగులో రాక్‌వుడ్ చర్చి



ప్రత్యేక అలంకరణలో నంద్యాలలోని చర్చి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. ఈనెల 25న కరుణామయుడు ఏసు క్రీస్తు పుట్టినరోజు సందర్భంగా పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించుకునేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఇళ్లను, చర్చీలను విద్యుద్దీపాలు, రంగురంగుల బెలూన్లతో ప్రత్యేకంగా అలంకరించారు. క్రీస్తు జనన ఇతి వృత్తాన్ని వివరించే బొమ్మలు, క్రిస్మస్ ట్రీలు, స్టార్లు ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు, నంద్యాలతో పాటు ముఖ్యమైన పట్టణాల్లో వాటి విక్రయాలు జోరందుకున్నాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకుని పేద, ధనిక తేడా లేకుండా అందరూ ఒకే చోట చేరి యేసు పుట్టుకను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు రాక్‌వుడ్ చర్చి పాస్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు.

– నంద్యాల (న్యూటౌన్)



స్టాంటన్ చర్చిలో విద్యుత్ దీపాల వెలుగులో క్రిస్మస్ ట్రీ

క్లుప్తంగా

ఫ్లగ్ బాక్స్ పేలడంతో అవ్వ, మనవరాలికి గాయాలు



గాయాలపాలైన తిమ్మమ్మ, హరిత

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో విద్యుత్ ప్లగ్ బాక్స్ పేలిపోయి మంటలు చెలరేగడంతో అవ్వ, మనవరాలికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన రంగస్వామి, మహేశ్వరి దంపతుల కుమార్తె 8 సంవత్సరాల హరితతో పాటు అవ్వ తిమ్మమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. విద్యుత్ స్విచ్ బోర్డు నుంచి ప్లగ్ బాక్స్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం హరిత సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి స్విచ్ ఆన్ చేయగా ప్లగ్ బాక్స్ ఒక్కసారిగా పేలిపోయి మంటలు చెలరేగాయి. బాలిక హరితతో పాటు పొయ్యి వద్ద వంట చేస్తున్న అవ్వ తిమ్మమ్మకు మంటలు వ్యాపించి శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని బాధితులను బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కర్నూలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతిచెందిన పెద్ద మద్దిలేటి

బనగానపల్లెరూరల్: మండలంలోని పసుపల తాండ క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్.పెద్ద మద్దిలేటి (74) మృతి చెందగా మరో ఇద్దరు గాయాలపాలైన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పసుపల గ్రామానికి చెందిన పెద్ద మద్దిలేటితో పాటు బి.బాలమద్దిలేటి, బి.గోపాల్ మోటార్ సైకిల్‌పై పని నిమిత్తం పసుపల తండాకు వెళ్లారు. పని ముగించుకొని స్వగ్రామానికి బయలుదేరారు. తండా క్రాస్ రోడ్డు వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి బనగానపల్లె వైపు వెళ్తున్న కారును ఢీకొట్టారు. ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పెద్ద మద్దిలేటి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన బాలమద్దిలేటి, గోపాల్‌ను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య చిన్నమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మరణించి ఇద్దరికి కంటివెలుగు



రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులకు నేత్రాలను అందజేస్తున్న కుటుంబసభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన శేగు అనసూయమ్మ మరణించడంతో కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్గాన్ డోనేషన్ మోటివేషన్ కో–ఆర్డినేటర్ ఆనంద్‌గురురాజీ మాట్లాడుతూ.. రామసుబ్బయ్య తల్లి శేగు అనసూయమ్మ ఆదివారం మరణించడంతో కుటుంబసభ్యులు ఆమె కళ్లను దానం చేసేందుకు తమను సంప్రదించారన్నారు. కర్నూలు నుంచి టెక్నీషియను వచ్చి మృతురాలి నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్వీ కంటి ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అనసూయమ్మ నేత్రదానం వల్ల చూపులేని ఇద్దరికి కంటిచూపు ప్రసాదించినట్లు అయిందన్నారు. చైర్మన్ దస్తగిరి, సుబ్బయ్య, ప్రదీప్, వరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

స్పెల్‌బీతో ఆంగ్ల భాషపై పట్టు

- సాక్షి ఆధ్వర్యంలో స్పెల్ బీ సెమీఫైనల్, 43 మంది విద్యార్థుల హాజరు
- సంతోషం వ్యక్తం చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు





రవీంద్ర స్కూల్‌లో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): సాక్షి, ఎరీనా స్కూలు ఫెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం నగరంలోని రవీంద్ర విద్యానికేతన్‌లో నిర్వహించిన పరీక్షకు 43 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన వారిని ఫైనల్‌కు ఎంపిక చేస్తారు. హైదరాబాద్‌లో ఫైనల్ పరీక్షలు జరుగుతాయి. అక్కడ మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపిక, నగదు బహుమతులను అందిస్తారు. కాగా స్పెల్ బీ ద్వారా ఇంగ్లిష్‌లో కష్టమైన పదాలకు సులభంగా అర్థాలు నేర్చుకున్నామని, ఈ పరీక్షలు తమ భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తాయని, ఉన్నత తరగతుల్లో రాణించేందుకు ఉపయుక్తంగా ఉంటాయని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామీణ విద్యార్థులకు వరంగా మారిన స్పెల్‌బీ

సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారాయి. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సంపాదించాలనే సంకల్పం ఉన్న విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారడంతో ప్రతి సంవత్సరం నిర్వహించే పరీక్షలకు వందలాదిగా విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి తరగతి నైపుణ్యాలను బట్టి క్వార్టర్ ఫైనల్‌కు ఎంపిక చేస్తారు. అక్కడ ఉత్తమంగా రాణించిన వారిని సెమీఫైనల్‌కు ఎంపిక చేస్తారు. అందులో భాగంగా సెమీ ఫైనల్‌కు 43 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారికి ఆదివారం రవీంద్ర విద్యానికేతన్‌లో పరీక్ష నిర్వహించారు. కాగా, 1, 2 తరగతుల విద్యార్థులను ఒక్క గ్రూపుగా, 3, 4, 5 తరగతుల వారిని రెండో గ్రూపుగా, 6, 7 తరగతుల విద్యార్థులను మూడో గ్రూపుగా, 8, 9, 10 తరగతుల విద్యార్థులను నాలుగో గ్రూపుగా వర్గీకరించి పరీక్షలు నిర్వహిస్తారు.

కష్టమైన పదాలకు సులభంగా అర్థాలు

ముఖ్యంగా స్పెల్‌బీ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ప్రనౌన్సేషన్, కష్టమైన పదాలకు సులభంగా స్పెల్లింగ్‌లు రాయడం, స్పీచ్, లిజనింగ్ (వినడం) తదితర విభాగాల్లో పట్టు సాధిస్తారు. తద్వారా ఆంగ్ల విద్యలో పట్టు సాధించేందుకు వారికి ఎంతో ప్రావీణ్యం కలుగుతుంది. ఈ పరీక్షను రాయడం ద్వారా క్రమ శిక్షణ విలువలు అలవడుతాయి. భవిష్యత్‌కు మంచి పునాది వేసుకున్నట్లు అవుతుండడంతో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు.

భవిష్యత్‌కు పునాది వేసుకున్నా



నేను స్పెల్‌బీ పరీక్షకు హాజరవుతున్నాను. నాకు ఇంగ్లిష్ పదాలు తెలిసినా వాటికి అర్థాలు తెలిసేవి కావు. చాలా భయం ఉండేది. దానిని పోగొట్టుకోవాలని అనుకుంటున్న తరుణంలో స్పెల్‌బీ గురించి విని వెంటనే పేరు నమోదు చేసుకున్నా. సాక్షి, ఎరీనా స్కూలు ఫెస్ట్ వారు ఇచ్చిన మెటీరియల్ చదివి చాలా పదాలకు అర్థాలు నేర్చుకున్నాను. వొకాబులరీని అర్థం చేసుకున్నాను. భవిష్యత్‌లో ఏ పరీక్షనైనా ఎదుర్కొవడానికి నాలోని భయం పోయింది. ఇది నా భవిష్యత్‌కు మంచి పునాది.

– తన్వీ, 9వ తరగతి, క్రైడో స్కూలు, కర్నూలు

థ్యాంక్స్ టూ సాక్షి



నేను ముందుగా 'సాక్షి'కి థ్యాంక్స్ చెబుతున్నా. నాలో ఉన్న దాగి ఉన్న నైపుణ్యాలను బయటకు తీసేందుకు సాక్షి ముందుడుగు వేయడం చాలా సంతోషం. నేను స్పెల్ బీ పరీక్షకు హాజరయ్యారు. సెమీ ఫైనల్‌లో మంచి మార్కులు వస్తాయని ఆశిస్తున్నాను. ఇప్పుడు ఇంగ్లిష్ అంటే నాకు భయం లేదు.

– జోనాథర్, 4వ తరగతి ఎడిఫై స్కూలు, కర్నూలు

ఇంగ్లిష్‌లో పట్టు సాధించా



నేను ఇంగ్లిష్‌లో మంచి పట్టు సాధించా. వొకాబులరీ, స్పీచ్, లిజనింగ్, స్పెల్లింగులు ఎన్నో నేర్చుకున్నా. గతంలో ఉన్న ఎన్నో అనుమానాలకు స్పెల్‌బీతో సమాధానాలు వచ్చాయి. భవిష్యత్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టు అంటే భయపడను. నాకు ఏకాగ్రత కుదిరింది.

– సమన్విత, 6వ తరగతి, క్రైడో స్కూలు, కర్నూలు

స్పెల్‌బీతో ఇంగ్లిషులో పూర్తిస్థాయిలో నైపుణ్యం



స్పెల్‌బీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ప్రనౌన్సేషన్, కష్టమైన పదాలకు సులభంగా అర్థాలు, స్పెల్లింగ్‌లు రాయడం, స్పీచ్, లిజనింగ్ (వినడం) తదితర విభాగాల్లో పట్టు సాధిస్తారు. తద్వారా ఇంగ్లిష్‌లో పూర్తి స్థాయిలో నైపుణ్యం కలుగుతుంది. ఎన్నో మేలకువలు నేర్చుకుంటున్నారు. చిన్నతనం నుంచే ఇలాంటి పరీక్షలు రాయించడం ద్వారా పిల్లల్లో భయాన్ని తొలగించవచ్చు.

– దివ్య, విద్యార్థి తల్లి, కర్నూలు

క్రమశిక్షణ అలవడుతుంది



స్పెల్‌బీ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచుతుంది. క్రమశిక్షణను పాటించేలా చేస్తుంది. ఈ పరీక్ష సామర్థ్యాలను అందుకునే విద్యార్థులు ఐఐటీ, నీట్‌లో రాణించేందుకు అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో మంచి ప్రయోజనాలను పొందుతారు. విద్యార్థులకు ఇలాంటి నైపుణ్య పరీక్షలు ఎంతో అవసరం.

– సుస్మిత, విద్యార్థి తల్లి, కర్నూలు

టానిక్ వికటించి 30 గొర్రెల మృత్యువాత

- వైద్యుల సిఫార్సు లేకుండా సొంతంగా అధిక డోసు ఇవ్వడంతో దుర్ఘటన



గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న రొనాల్డ్ రిచర్డ్స్

సి.బెళగల్: గొర్రెల పెంపకందారుల సొంత వైద్యం వికటించి 30 జీవాలు మృత్యువాత పడిన సంఘటన సి.బెళగల్ మండలం తిమ్మందొడ్డి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న గోరంట్లకు 600కు పైగా గొర్రెలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం గొర్రెలకు బలం కోసం వైద్యుల సిఫార్సు లేకుండా సొంతంగా టానిక్ తీసుకొచ్చి తాపించాడు. అధిక డోస్ టానిక్‌ను గొర్రెలకు తాపడంతో వికటించి శనివారం రెండు గొర్రెలు మృతి చెందగా, ఆదివారం ఉదయం 6 గంటలకు ఒక్కసారిగా 28 గొర్రెలు అస్వస్థతకు గురై మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పోలకల్ పశువైద్యుడు రొనాల్డ్ రిచర్డ్ పోలకల్, కొత్తకోట పశు వైద్యశాలల సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. అనారోగ్యంతో ఉన్న గొర్రెలకు వైద్యం అందించారు. మృతి చెందిన గొర్రెల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించగా.. టానిక్ అధిక డోసు తాపడం వల్లే జీవాలు మృత్యువాత పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. అలాగే చనిపోయిన గొర్రెల అంతర్గత భాగాలను సేకరించి కర్నూలు ల్యాబ్‌కు పంపించారు.

'గోర్‌బోలి'కి రాజ్యాంగ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్.కైలాస్‌నాయక్

కర్నూలు(హాస్పిటల్): దేశంలో 15 కోట్ల మంది బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషకు రాజ్యాంగ హోదా కల్పించే వరకు పోరాటాలు సాగిస్తామని బంజారా, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్ నాయక్ స్పష్టం చేశారు. ఆదివారం కర్నూలు, బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2015 నుంచి బంజారా గోర్ సంస్కృతి, సాంప్రదాయాల రక్షణకై 'మేమంతా ఒక్కటే, మా భాష ఒక్కటే, మా భాషకు రాజ్యాంగ హోదా కల్పించాలి' అన్నదే తమ నినాదమన్నారు. బంజారాల అభివృద్ధి, హక్కుల కోసం 'మా తండాలో మా రాజ్యం స్థాపన' ధ్యేయంగా అలుపెరగని పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 12 లక్షలకు పైగా బంజారాలు ఉన్నారని, తమ వర్గానికి రాజకీయంగా పదవులు కల్పించాలన్నారు. జనవరిలో గుంటూరు కార్యాలయంలో జాతీయ ఉపాధ్యక్షుడు సభావత్‌తావులాల్ నాయక్‌ను రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న రవినాయక్‌ను రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్‌గా నియమిస్తున్నామన్నారు. వీరు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు కోసం పనిచేస్తారని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు నాగరాజునాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే పీడీ యాక్ట్



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

నందికొట్కూరు: మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను ఆదివారం ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐ జఫ్రుల్లా, పోలీసులు ధ్వంసం చేశారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు.. ఆ శాఖ పోలీసులు మండలంలోని నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. షికారి దుర్గ అనే మహిళ వద్ద 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నాటుసారా తయారుచేసినా, విక్రయించినా, ఇతర ప్రాంతాలకు తరలించినా క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు వాహనాలను సీజ్ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు కృపవరకుమారి, శంకర్‌నాయక్, రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నెట్‌బాల్ విజేత గోదావరి జట్లు



విజేతలుగా నిలిచిన బాలికల జట్టు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ 10వ సబ్ జూనియర్ బాలబాలికల అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. బాలికల విభాగం విజేతగా పశ్చిమ గోదావరి జిల్లా, రన్నరప్‌గా విశాఖపట్నం జిల్లా, మూడో స్థానంలో కృష్ణ జిల్లా జట్లు నిలిచాయి. అలాగే బాలుర విభాగం విజేతగా తూర్పు గోదావరి జిల్లా, రన్నరప్‌గా విశాఖపట్నం జిల్లా, మూడో స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా జట్లు గెలుపొందాయి. విజేతలుగా నిలిచిన జట్లకు నిర్వాహకులు మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి, నెట్‌బాల్ సంఘం చైర్మన్ ఆనందరావు, సంఘం వ్యవస్థాపకులు నాగరత్నమయ్య, అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఆఫీస్ అటెండర్ ఆత్మహత్య

కర్నూలు: కార్మిక శాఖ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న విజయభాస్కర్ (32) ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కర్నూలు శ్రీరామ్ నగర్‌కు చెందిన ఈయనకు 2018లో భూపాల్ నగర్‌కు చెందిన కళ్యాణితో వివాహమయ్యింది. పెళ్లి జరిగిన కొన్నాళ్లకే దంపతులు భూపాల్ నగర్‌లో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. వీరికి కూతురు, కుమారుడు సంతానం ఉన్నారు. ఇదిలాఉండగా విజయభాస్కర్ కొంతకాలంగా మద్యానికి బానిసై విధులకు వెళ్లకుండా తిరుగుతుండేవాడు. కుటుంబసభ్యులు ఎంత చెప్పినా పట్టించుకోకుండా వారిని కూడా వేధించేవాడు. క్రిస్మస్ పండుగ కోసం పట్టణంలోనే ఉంటున్న అత్తారింటికి వెళ్లారు. శనివారం మధ్యాహ్నం పూటుగా మద్యం సేవించి అద్దె ఇంటికి వెళ్లి పడుకుంటానని చెప్పి వెళ్లి ఉరి వేసుకున్నాడు. సాయంత్రం కుటుంబసభ్యులు ఉరి నుంచి తప్పించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వరిగడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు



కోడుమూరు రూరల్: వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంఘటన రాత్రి కోడుమూరు –ఎమ్మిగనూరు రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఇద్దరు మహిళా ఉద్యోగులు ఆదివారం సెలవు నేపథ్యంలో ఆదోని నుంచి కారులో కర్నూలుకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో కోడుమూరు సమీపాన ముందు వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రమాదశాత్తూ కారు ఢీకొంది కారులోని ఏయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో డ్రైవర్‌తో పాటు, ఇద్దరు మహిళా ఉద్యోగులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎల్లమ్మ బీడు ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శనివారం అర్ధరాత్రి పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎల్లమ్మ బీడు ప్రాంతంలోని ఖాళీ మైదానంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు పట్టణ పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంలో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. రేషన్ బియ్యంతో పాటు ఆటో, కారును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై పట్టణ సీఐ శ్రీనివాసులును వివరాలు కోరగా బియ్యం స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఆదివారం సాయంత్రం చెప్పారు.

మహిళ అదృశ్యం

ఆస్పరి: మండల కేంద్రానికి చెందిన 48 ఏళ్ల బోయ మహాదేవి అనే మహిళ 10 రోజుల నుంచి కనిపించడం లేదని ఆదివారం ఆస్పరి సీఐ మస్తాన్‌వలికి ఫిర్యాదు చేసినట్లు భర్త లక్ష్మన్న విలేకరులకు తెలిపారు. మహిళకు మతిస్థితిమితం సరిగా లేదని, ఇంటి నుంచి ఎక్కడకు వెళ్లిందో తెలియడం లేదన్నారు. బంధువుల ఇళ్లు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. మహిళను గుర్తించిన వారు సెల్ 99635 70248 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మహిళ కోసం గాలిస్తామని సీఐ మస్తాన్‌వలి చెప్పారు.

కారు, లారీ ఢీ: నర్సు దుర్మరణం



దోర్నాల వైద్యశాలలో మల్లిక మృతదేహం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వైద్యశాలలో నర్సుగా పనిచేస్తున్న మల్లిక (36), భర్త, కూతురుతో ప్రయాణిస్తున్న కారు దోర్నాల వద్ద బస్సును ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దోర్నాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భర్త మనోహర్, కూతురు జెస్సిక (10) కారులో ముందు కూర్చోగా ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్ బెలూన్స్ తెరచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై దోర్నాల పోలీసుల కథనం మేరకు.. నర్సు కుటుంబం శనివారం కర్నూలులో షాపింగ్ చేసేందుకు వెళ్లి, రాత్రి సినిమా చూసి తిరుగు ప్రయాణమయ్యారు. దోర్నాల దాటుకుని శ్రీశైలం వెళ్లే రహదారిలో ఫారెస్ట్ చెక్‌పోస్టు కొద్దిదూరంలో ఉండగానే ముందు వెళ్తున్న బస్సును కారు ఢీకొట్టింది. వెనుక సీటులో కూర్చున్న మల్లిక తల సీటుకు బలంగా తగలడంతో మృత్యువాత పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని శ్రీశైలం తీసుకొస్తున్నట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న దేవస్థానం వైద్యశాల సిబ్బంది, స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నేత్ర వైద్యుల వైజ్ఞానిక సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న నేత్ర వైద్యులు

నంద్యాల (వ్యవసాయం): ఉమ్మడి జిల్లా నేత్ర వైద్యుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మధుమణి ఆసుపత్రిలో 'కంటిలో గ్లకోమా సమస్యలు' అన్న అంశంపై ప్రాంతీయ వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ నర్సిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మహిళా వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, రాష్ట్ర ఆప్తాల్మిక్ సొసైటీ అకాడమిక్ రీసెర్చ్ కమిటీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైజ్ఞానిక సదస్సుల ద్వారా వైద్యులు పరిజ్ఞానం పెంచుకోవాలని, ఆధునిక వైద్య విధానాలు, నూతన పరికరాల గురించి అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అలాగే జబ్బులపై లోతైన అవగాహన కలుగుతుందన్నారు. యువ వైద్యుల కోసం నిరంతరం వైజ్ఞానిక సదస్సులు నిర్వహించి ఆధునిక చికిత్స విధానాలను తెలియజేస్తామన్నారు. వివిధ అంశాలపై నేత్ర వైద్యులు ప్రదీప్, క్రాంతి, మదన్మోహన్, ప్రవీణ, విజయ, సింధూర వివరించారు. నంద్యాల, కర్నూలు, అనంతపురం తదితర జిల్లాల నేత్ర వైద్యులు పాల్గొన్నారు.

కంది ముంచింది.. 'శని'గ వదలకుంది

- తుపాను ప్రభావంతో పూత రాలిపోయి దెబ్బతిన్న పైరు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి



సరైన కాపు లేని కంది పైరు



వర్షాలకు ఎర్రబారిన శనగ పైరు

కోడుమూరు రూరల్: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నకు అన్నింటా కష్టాలే ఎదురవుతున్నాయి. అధికార కూటమి ప్రభుత్వం కరుణ చూపకపోయినా లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే దిగుబడులు చేతికొస్తాయన్న నమ్మకం లేని పరిస్థితి. వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్ నష్టాలు మిగిల్చినా, రబీ కరుణిస్తే నష్టం కాసింతైనా పూడ్చుకుందామనుకున్న రైతులకు వరుసగా ముంచుకొస్తున్న తుపాన్లు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

భారీగా తగ్గిన కంది దిగుబడులు

కందులకు మార్కెట్లో ఉన్న డిమాండ్ వల్ల ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 62,326 హెక్టార్లలో రైతులు వర్షాధారంగా కంది పంటను సాగు చేశారు. ప్రస్తుతం కంది పంట కోతలు మొదలయ్యాయి. అయితే కంది పంట పూత దశలో కురిసిన వర్షాల వల్ల దిగుబడులు భారీగా తగ్గిపోయాయని రైతులు తెలిపారు. వానల వల్ల కంది బుడ్డలన్నీ నత్తలుగా మారడంతో ఎకరాకు 2 క్వింటాళ్లకు మించి దిగుబడి రాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కంది పంట సాగుకు ఎకరాకు రూ.15 వేల దాకా ఖర్చు పెడితే ప్రస్తుతం వస్తున్న దిగుబడులను చూస్తే పెట్టిన పెట్టుబడులు కూడా దక్కడం లేదు. గోరు చుట్టుపై రోకలి పోటు పడ్డట్టు మార్కెట్లో కూడా కందుల ధర భారీగా తగ్గిపోయింది. నెల రోజుల కిందటి వరకు రూ.10 వేలకు పైగా ధర పలికిన కందులు ప్రస్తుతం రూ.7 వేలకు పడిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఆశలు చిదిమేసిన శనగ

రబీ ప్రారంభంలో కురిసిన వర్షాలకు జిల్లాలోని కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో చాలామంది రైతులు సుమారు 45,279కుపైగా హెక్టార్లలో శనగ పంటను సాగు చేశారు. ముందుగా సాగుచేసిన శనగ పైరు పూత, బుడ్డ దశలో ఉండగా గత నెలలో కురిసిన వర్షాలకు పూత రాలిపోవడంతో పాటు, పులుసు కారిపోయి భారీగా దెబ్బతిన్నాయి. అంతంతమాత్రంగా ఉన్న పైర్లపై తుపాను ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న చిరుజల్లుల వల్ల ఎర్ర తెగులు సోకి చెట్లన్నీ పండుటాకులు పడి ఎర్రగా మారిపోతున్నాయి. దీని వల్ల చెట్టుకున్న శనగ గింజలు కూడా నట్టలుగా మారుతాయని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇదిలాఉండగా రబీ ప్రారంభమైన తర్వాత, ఉల్లి కోతలనంతరం రైతులు సాగుచేసిన శనగ పైరుకు కూడా గత 10 రోజులుగా ఏర్పడుతున్న తుపాన్ల వల్ల పూత నిలవని పరిస్థితి నెలకొంది. దీంతో దిగుబడులు భారీగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. రబీలో ముందస్తుగా శనగ సాగు చేసిన రైతులకు, వెనుక పాటుగా సాగు చేసిన వారికి సైతం తుపాన్ల వల్ల తీవ్రం నష్టం వాటిల్లింది. ఒక ఎకరం శనగ సాగుకు రైతులు రూ.13 వేల రూ.15 వేల దాకా పెట్టుబడులు పెట్టారు. గత నాలుగైదేళ్లలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడు రాలేదని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



ప్రస్తుత రబీ సీజన్‌లో రూ.లక్షన్నరకు పైగా పెట్టుబడి పెట్టి పదెకరాల్లో శనగ పంట సాగు చేశాను. తుపాన్ల వల్ల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు శనగ పైరుకు పూత నిలవని పరిస్థితి. పూత కోసం మందులు పిచికారీ చేస్తున్నా ప్రయోజనం లేదు. పరిస్థితి చూస్తే శనగ పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కేటట్లు లేవు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

– రైతు మహేశ్వరరెడ్డి, వెంకటగిరి

తీవ్ర నష్టం



నేను ఖరీఫ్‌లో కౌలుకు తీసుకున్న నాలుగెకరాల్లో రూ.70 వేలు పెట్టుబడి పెట్టి కంది సాగు చేస్తే 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడులు కూడా రాలేదు. రబీ కింద సొంత పొలంతో పాటు, కౌలు పొలంతో కలిపి రూ.3 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి 20 ఎకరాల్లో శనగ సాగు చేస్తే గత నెల కురిసిన వర్షాలకు పూత రాలిపోయి, పులుసు కారిపోయి తీవ్రంగా దెబ్బతింది. ఏమి చేయాలో పాలుపోవడం లేదు. వాతావరణ పరిస్థితులు, తుపాన్ల వల్ల ఈ ఏడాది పంటల దిగుబడి సరిగా లేదు. ప్రభుత్వం ఆదుకోకపోతే వ్యవసాయానికి స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి.

– రైతు లక్ష్మన్న, కోడుమూరు